సాక్షి నిర్మల్

మంగళవారం : 30 : ఏప్రిల్ : 2024



లెక్క లేదంటే.. వేటే!

8లో ▸

పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయ వివరాలు ఎన్నికల సంఘానికి సమర్పించాలి. లేనిపక్షంలో తర్వాత జరిగే ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది.

బీఆర్ఎస్ సమన్వయకర్తగా రాంకిషన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: భారత రాష్ట్ర సమితి నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆదిలాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ కోరిపెల్లి రాంకిషన్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు నాయకులు రాంకిషన్‌రెడ్డిని అభినందించారు.

గరిష్టం/కనిష్టం
42.6 /29.5

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు మబ్బు పడుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ఎంపిక పోటీలు నిర్వహించారు. కొండూరు రిషిక 60–63 కేజీల బాలిక విభాగంలో, ఇర్ఫాన్ బాలుర 50–52 కేజీలలో ఎంపికయ్యారు. మే 3, 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లోని లాలాగూడలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి చందుల స్వామి, కోచ్ చిరంజీవి, శేఖర్, శ్రీకాంత్, అనూష అభినందించారు.

ముగిసిన ఉద్యోగ మేళా

- 15 మంది ప్రభుత్వ డిగ్రీ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగమేళా నిర్వహిస్తున్న టాస్క్ అధికారులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉద్యోగ మేళా విజయవంతంగా ముగిసింది. ప్రముఖ కార్పొరేట్ కంపెనీలైన జియో సెల్యులార్ నెట్‌వర్క్, ముత్తూట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థల్లో ఉద్యోగాలకు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో రాత పరీక్ష, సాంకేతిక పరీక్షతోపాటు వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో టాస్క్ సమన్వయకర్త శంకర్, మెంటార్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి రవికుమార్, అధ్యాపకులు పీజీ.రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం



కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ వివేక్ హైస్కూల్‌లో ఝాన్సీలక్ష్మీబాయి ఉచిత కరాటే వేసవి శిక్షణ శిబిరాన్ని సివిల్ సర్జన్ డాక్టర్ రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఆత్మరక్షణ కోసం కరాటే చాలా అవసరమన్నారు. పురుషులతోపాటు మహిళలు సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. విద్యార్థినులు చదువుతోపాటు శరీరక, మానసిక ఆరోగ్యాలను కూడా మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షొటోకన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మహిళ కార్యవహ అనురాధ, సోలాపూర్ రాజేశ్వర్, శిక్షకురాలు కిన్నెర్ల మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో అహోబిలం పీఠాధిపతి



భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న పీఠాధిపతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతనమైన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థాన ఆలయంలో అహోబిలం 46వ పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్రస్వామి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఆలయ అర్చకులు పూర్ణకుంభం భాజా భజంత్రీల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రవచనాలు చేశారు. అయోధ్య తిరుగు ప్రయాణంలో ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యల హాజరై పీఠాధిపతిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీనివాస్ రాజేశ్వర్, జాప అనిల్, దేవేందర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు (ఫైల్)

అతివలే నిర్ణేతలు

- పురుషులతో పోల్చితే 40వేల ఓట్లు అధికం
- ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారిదే ఆధిపత్యం
- మహిళా ఓట్లపై రాజకీయ పార్టీల ఫోకస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మహిళలే నిర్ణయించనున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఓట్లలో పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వారు ఎవరిని అనుగ్రహిస్తారో వారికే విజయం వరించనుంది. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఐదింటిలో మహిళా ఓటర్లదే ఆధిపత్యం కనిపిస్తోంది. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలు వీరిపైనే దృష్టి సారించాయి.

ఐదు నియోజకవర్గాల్లో అధికం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 16,50,175 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,04,875 మంది, మహిళా ఓటర్లు 8,45,213 మంది ఉన్నారు. ఇతరులు 87 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్య 40,338 అధికంగా ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఇందులో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో మాత్రమే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్ ఐదు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. వీరి ఓట్లు ఎవరికి ఎక్కువగా దక్కుతాయో వారినే విజయం వరించనుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కీలకమైన మహిళా నాయకురాళ్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రసన్నం చేసుకునే దిశగా కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేసేలా దృష్టి సారిస్తున్నాయి.

ప్రసన్నం చేసుకునే యత్నాలు..

అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించే ప్రధాన శక్తిగా ఉన్న మహిళా ఓటర్లపైనే అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వారిని ప్రసన్నం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ప్రత్యేక తాయిలాలు ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం జూలైలో ముగియనుంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా కీలకమైన మున్సిపాలిటీల పదవీ కాలం వచ్చే జనవరిలో ముగియనుంది. అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉన్నందున ఆయా పదవుల్లో తగిన గుర్తింపు ఇస్తామని రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్నాయి. ప్రస్తుతం తమకు మద్దతుగా నిలువాలని కోరుతున్నాయి. మహిళా నాయకులు సైతం పురుషులతో సమానంగా పోటాపోటీగా ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే అగ్రనేతలు వచ్చే సభలకు మహిళలను ఎక్కువగా తరలిస్తూ తాము కూడా తక్కువ కాదనే రీతిలో బలాన్ని చాటుతున్నారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
సిర్పూర్	1,14,522	1,14,567	12
ఆసిఫాబాద్	1,12,788	1,14,404	16
ఖానాపూర్	1,09,685	1,14,825	13
ఆదిలాబాద్	1,19,848	1,25,283	06
బోథ్	1,02,458	1,08,852	03
నిర్మల్	1,21,991	1,36,304	19
ముధోల్	1,23,583	1,30,978	18

నారీశక్తి.. కీలకం

రాజకీయకంగా పదవులను దక్కించుకోకపోయినా ఏ అభ్యర్థికి పదవిని కట్టబెట్టాలనే స్థాయిలో ఉండటం నారీశక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఇప్పటికే ప్రధాన పార్టీలు మహిళా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపునిస్తామని ఆశలు కల్పిస్తూ ఈ ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలువాలని కోరుతున్నారు. పురుషులతో సమానంగా మహిళా నాయకులు ఇంటింటి ప్రచారంలో ముందుంటున్నారు.

ఆదిలాబాద్‌లో 12.. పెద్దపల్లిలో 42

- లోక్‌సభ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



నామినేషన్ ఉపసంహరించుకున్న రాథోడ్ రాజు

సాక్షి, పెద్దపల్లి/కైలాస్‌నగర్: ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ పర్వం సోమవారం ముగిసింది. ప్రధాన పార్టీలతోపాటు బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థుల లెక్క తేలడంతో పోరు మిగిలింది. ఆదిలాబాద్ బరిలో 12మంది, పెద్దపల్లి బరిలో 42మంది ఉన్నారు. ఆదిలాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉండగా స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ రాజు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషాకు తన ఉప సంహరణ పత్రాలు అందజేశారు. దీంతో పార్లమెంటు ఎన్నికల బరిలో 12మంది అభ్యర్థులు నిలిచారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి ప్రధాన పార్టీల తరఫున ముగ్గురు పోటీలో ఉండగా మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరో ఏడుగురు అభ్యర్థులు ఇతర రాజకీయ పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసి, పోటీ పడే అభ్యర్థులు ఖరారు కావడంతో మంగళవారం నుంచి ఎంపీ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది.

పెద్దపల్లిలో..

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గానికి 63మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 14మంది నామినేషన్లను తిరస్కరించగా.. సోమవారం నామినేషన్ ఉపసంహరణకు చివరి రోజు కావడంతో పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏడుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు ఫాం–5 పూరించి ఆర్వోలకు అందజేశారు. దీంతో 42మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర ప్రధాన పార్టీలకు చెందిన వారితోపాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. రిటర్నింగ్ అధికారులు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

ఆదిలాబాద్‌లో ఒకటి, పెద్దపల్లిలో మూడు ఈవీఎంలు

ఒక స్థానంలో 15మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ బరిలో 12మంది ఉండడంతో ఒకటి, పెద్దపల్లి బరిలో 42మంది ఉండడంతో మూడు ఈవీఎంలు వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పెద్దపల్లిలో స్వతంత్ర అభ్యర్థులను ఎన్నికల బరిలో నుంచి తప్పించేందుకు ప్రధాన పార్టీల నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే ఈసారి గతంలో కంటే ఎక్కువ మంది బరిలో నిలిచినట్లు తెలుస్తోంది. 2019లో పెద్దపల్లి లోక్‌సభ బరిలో 18 మంది అభ్యర్థులుండగా, ఈసారి 42 మంది పోటీలో ఉన్నారు. చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఓట్లు చీల్చడం వల్ల ఏ పార్టీకి నష్టం చేకూరుతుంది? ఎంత మేరకు వీరి ప్రభావం ఉండనుందనే చర్చ అన్ని పార్టీల్లో జోరుగా సాగుతోంది.

ఆదిలాబాద్‌లో..

అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ	గుర్తు
ఆత్రం సక్కు	భారత రాష్ట్ర సమితి	కారు
ఆత్రం సుగుణ	ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	చెయ్యి
గోడం నగేష్	భారతీయ జనతా పార్టీ	కమలం
జంగు బాపూ మెస్రం	బహుజన్ సమాజ్ పార్టీ	ఏనుగు
కొడప వామన్‌రావు	గొండ్వానా దండకారణ్య పార్టీ	తుర్హా ఊదుతున్నమనిషి
గేడం సాగర్	ఇండియా ప్రజాబంధు పార్టీ	ట్రంపెట్
రాథోడ్ సుభాష్	ఇండిపెండెంట్	గ్యాస్ సిలిండర్
ఎం.శ్యామ్‌లాల్‌నాయక్	అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్	చపాతి రోలర్
భుక్యా జైవంత్ రావు	స్వతంత్ర అభ్యర్థి	ప్రెషర్ కుక్కర్
నునావత్ తిరుపతి	విద్యార్థుల రాజకీయ పార్టీ	బ్యాట్
చవాన్ సుదర్శన్	అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ	రోడ్‌రోలర్
మెస్రం గంగాదేవి	ధర్మ సమాజ్ పార్టీ	పాదరక్షలు

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా




బీజేపీలో చేరుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్

కడెం/ఖానాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే ఖానాపూర్ నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ హామీ ఇచ్చారు. కడెం మండల కేంద్రంతోపాటుగా, మండలంలోని లింగాపూర్, ఖానాపూర్ పట్టణంతోపాటు మండలంలోని సుర్జాపూర్, మస్కాపూర్, బాదనకుర్తి, గోసంపల్లె గ్రామాల్లో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 1995లో తాను మంత్రిగా ఉన్న సమయంలో కడెం ప్రాజెక్టు తెగినప్పుడు సీఎం చంద్రబాబునాయుడిని రప్పించి మరమ్మతులు చేయించానని గుర్తు చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌తో ఈప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటవీ నిబంధనలు అభివృద్ధికి అడ్డంకిగా మారాయని, ఎంపీగా గెలిచాక సమస్య పరిష్కరిస్తానన్నారు. మోదీ నాయకత్వంలోనే దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి అంకం మహేందర్, కడెం మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, టీకు ప్రకాశ్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, గడ్డం రవీందర్, మల్లయ్య, రమణారెడ్డి, మోహన్ నాయక్, ముల్కి కృష్ణ, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్, నగేశ్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్

- ఏడు నియోజకవర్గాలకు 190 మంది కేటాయింపు



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మైక్రోఅబ్జర్వర్స్ ర్యాండమైజేషన్‌ను సోమవారం నిర్వహించారు. సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టారు. అదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి 14మంది, బోథ్‌కు 30, ఆసిఫాబాద్‌కు 24, సిర్పూర్‌కు 16, నిర్మల్‌కు 30, ఖానాపూర్‌కు 49, ముధోల్‌కు 27 మంది చొప్పున మొత్తం 190మందిని కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఈడీఎంలు, జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో విజయాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఇంటర్మీడియెట్ విద్యాధికారి పరశురాం

నిర్మల్‌టౌన్: నాణ్యమైన విద్యతో విజయాలను సాధిస్తామని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి జాదవ్ పరశురాం అన్నారు. డీఐఈవో కార్యాలయంలో ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆల్ఫోర్స్ విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చక్కటి ప్రణాళికతో విజయాలను సులువుగా సాధించవచ్చని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు.

జొన్న రైతుకు ని‘బంధనాలు’



కుంటాలలో జొన్నలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

- ఎకరాకు 8.85 క్వింటాళ్లే కొనుగోలు..
- ఆన్‌లైన్‌లో నమోదైతేనే..
- ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి
- జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు
- ఆరు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం

భైంసా: జిల్లాలో జొన్న కొనుగోళ్లపై అధికారుల నిబంధనలు అన్నదాతకు ఇబ్బందిగా మారాయి. అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది జిల్లాలో 15 వేల ఎకరాల్లో జొన్నపంట సాగైంది. చాలామంది రైతులు పంట సాగు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేదు. ఈ లెక్కన మరో 2వేల ఎకరాల సాగు ఖచ్చితంగా పెరుగుతుంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల మేర దిగుబడి రానుంది. కానీ అధికారులు ఎకరాకు 8.85 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసేలా ఆన్‌లైన్‌లో నిబంధన విధించారు. కొత్త నిబంధనతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ఎంత పంట తీసుకువచ్చినా ఎకరానికి 8.85 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో పంట పండించిన రైతులు ప్రస్తుతం అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నారు.

పంట మార్పిడిపై దృష్టి...

ఈ ఏడాది జొన్న పంట బాగానే పండింది. రైతులు పంటమార్పిడిపై దృష్టి సారించారు. మొక్కజొన్న వేసే రైతుల్లో చాలా మంది జొన్నపంట వైపు మొగ్గుతున్నారు. జొన్నపంట వైపు రైతులు మళ్లుతున్న నిబంధనతో ఇబ్బందిపడుతున్నారు. వచ్చిన దిగుబడి ఎక్కడ విక్రయించుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. నిబంధన సడలించాలని కోరుతున్నారు.

జిల్లాలో ఎనిమిది కేంద్రాలు

జొన్నల కొనుగోలు కోసం అధికార యంత్రాంగం జిల్లాలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసింది. మాటేగాం, కుంటాల, పెంబికల్‌పాడ్, కల్లూరు, కుభీర్, మాలేగాం, సారంగాపూర్‌లో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభించింది. సోమవారం నుంచి గుండంపెల్లి, తానూరులో మరో రెండు కేంద్రాలను ప్రారంభించనుంది. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతుల పంటను తూకం వేస్తున్నారు. అధికార యంత్రాంగం కొనుగోళ్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలో 30 వేల క్వింటాళ్ల మేర జొన్నలు కొనుగోలు చేశారు. అధికారుల అంచనా ప్రకారం 1.40 లక్షల క్వింటాళ్ల మేర కొనుగోళ్లు చేపట్టవచ్చని చెబుతున్నారు. కానీ రైతులు పండించిన పంట దిగుబడి 3 లక్షల క్వింటాళ్లు దాటనుంది. కొనుగోలు కేంద్రాల్లో ఈ నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటులో అమ్ముకుందామన్న ధర కలిసి రాదేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జిల్లాలో జొన్న రైతులు పండించిన పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

మంచి దిగుబడి...

ఈ ఏడాది జిల్లాలో జొన్నపంట బాగానే పండింది. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఇన్ని రోజులు కొనుగోలు కేంద్రాల కోసం రైతులు నిరీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా కొత్త నిబంధనలతో ఏం చేయలేక పోతున్నారు. ఆన్‌లైన్‌లో సూచించిన విధంగా ఎకరానికి 8.85 క్వింటాళ్లు అమ్ముకుని మిగతా పంటను ప్రైవేటుగా అమ్ముకుంటున్నారు. అధికారులు స్పందించి ఆన్‌లైన్‌లో ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల మేర కొనుగోలు చేసేలా నిబంధనలు మార్చాలని జొన్న రైతులు కోరుతున్నారు.

జిల్లా : నిర్మల్

సాగు చేసిన జొన్నపంట : **15 వేల ఎకరాలు**

మద్దతు ధర : **క్వింటాలుకు రూ.3,180**

కొనుగోలు కేంద్రాలు : **8**

ప్రారంభమైనవి : **6**

ఇప్పటి వరకు కొనుగోలు చేసిన జొన్నలు : **30 వేల క్వింటాళ్లు**

కొనుగోళ్ల అంచనా : **1.40 లక్షల క్వింటాళ్లు**

పంట దిగుబడి : **3 లక్షల క్వింటాళ్లకు పైగానే**

నిబంధన సడలించాలి



వేసవిలో మూడెకరాల్లో జొన్నపంట సాగు చేశా. ఎకరాకు 20 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. అధికారులు 8.85 క్వింటాళ్లు మాత్రమే కొంటామని ప్రకటించారు. మిగిలిన పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియడంలేదు. షరతులు లేకుండా పంట మొత్తం కొనుగోలు చేయాలి.

– రమాకాంత్‌రావు, రైతు, కల్లూరు

ఎనిమిది కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ఎనిమిది జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆరింటిలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. మిగిలిన రెండు కేంద్రాలు కూడా ప్రారంభమవుతాయి. ఎకరాకు 8.85 క్వింటాళ్లు తీసుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటాలు జొన్నలకు రూ.3,180 ధర చెల్లిస్తుంది. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

గోడం నగేష్ వాహనం తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌లో సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ వాహనాన్ని ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ వాహనం డోర్ తీసి తనిఖీ చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీం ఇన్‌చార్జి రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో తునికాకు కూలీ అదృశ్యం


బక్కన్న (ఫైల్)

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం గ్రామానికి చెందిన మొకిరాల బక్కన్న (55) అడవిలో అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మొకిరాల బక్కన్న, అల్లాటి గంగన్న, నర్సయ్య, నర్సవ్వ నలుగురూ కలిసి ఆదివారం తెల్లవారుజామున కడెం మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతంలోకి తునికాకు సేకరణకు వెళ్లారు. అక్కడికి వెళ్లాక తలోదిక్కు వెళ్లి ఆకు సేకరణ పూర్తి చేసుకుని తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకోవాలని అనుకున్నారు. కానీ ముగ్గురు మాత్రమే అనుకున్న స్థలానికి వచ్చారు. బక్కన్న రాకపోవడంతో అడివంతా గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అటవీశాఖ అధికారులు, కడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం

భైంసారూరల్: మండలంలోని కామోల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి ఐదెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. సోమవారం పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో పంటకు నిప్పంటుకుంది. గమనించిన సమీపంలోని రైతులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఎకరం విస్తీర్ణంలో పంట పూర్తిగా కాలిపోయింది. సుమారు 40 క్వింటాళ్ల పంట దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

బాల్య వివాహం అడ్డగింత

వాంకిడి: మండలంలోని నవేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని టోకిగూడలో పెద్దలు నిశ్చయించిన బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణ అధి కారి బూర్ల మహేష్ ఆధ్వర్యంలో సోమవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన గి రిజాబాయి, లింగు దంపతుల కుమార్తె (16)కు అదే గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపించేందుకు పెద్దలు నిశ్చయించుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించిన అధికారులు బాల్య వివాహాలపై ఇరు కుటుంబాలకు అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏళ్లు నిండక ముందే వి వాహం జరిపిస్తే చట్టరీత్యా నేరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, సోషల్ వర్కర్ డోంగ్రె ప్రవీణ్, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

లెక్క లేదంటే.. వేటే..!

- ఎన్నికల్లో ప్రచార వ్యయం వివరాలు సమర్పించాల్సిందే
- వ్యయ పరిశీలనకు ప్రత్యేక అధికారులు



సాక్షి, మంచిర్యాలడెస్క్: ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఆదిలాబాద్‌లో 12 మంది, పెద్దపల్లిలో 42మంది బరిలో ఉన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రచారమూ ప్రభావితం చేస్తుంది. ఆ ప్రచార వ్యయం కూడా పెరుగుతూ వస్తోంది. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సభలకు జనాలను తరలించే వాహనాలు, భోజనాలు, టెంట్లు ఇలా ప్రతీ దానికి అభ్యర్థులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటన్నింటికి కూడా ఎన్నికల సంఘం స్థానికంగా ధరలను అనుసరించి చెల్లింపులను నిర్దేశించింది. ఆ మేరకు వ్యయ వివరాలను అభ్యర్థులు నమోదు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులో ఖాతా తెరిచి దాని ద్వారానే చెల్లింపులు చేయాలి. అభ్యర్థులు ప్రచార వ్యయానికి సంబంధించి ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికలు పూర్తయిన తర్వాత నెల రోజుల్లోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలి. లేనిపక్షంలో ఆ తర్వాత జరిగే ఎన్ని కల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది. అలా వేటు పడిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 107మంది ఉన్నా రు.

వ్యయ పరిశీలకులు వీరే..

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా మహారాష్ట్రకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి జాదావార్ వివేకానంద, పెద్దపల్లి నియోజకవర్గానికి సమీర్ నైరంతర్య వ్యవహరిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో వీరు పర్యటించి రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార వ్యయాలను పరిశీలిస్తారు.

పెంపు ఇలా..

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయ పరిమితి 1952లో రూ.25వేలుగా ఉండేది. 1971లో రూ.35వేలు ఉండగా.. 1980లో రూ.లక్షకు పెరిగింది. 1984నుంచి 1991వరకు రూ.1.50లక్షలు, 1996లో రూ.4.50లక్షలకు చేరింది. 1998లో రూ.15లక్షలు, 2004లో రూ.25లక్షలకు పెరుగుతూ వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచార వ్యయ పరిమితిపై ప్రధాన సవరణ జరిగి రూ.70లక్షలకు పెరిగింది. దీనిపై 2020లో 10శాతం పెరిగింది. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు 2022లో ప్రచార వ్యయ పరిమితిని రూ.95లక్షలకు పెంచారు. లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ప్రచారానికి ఖర్చు చేసే అవకాశం ఉంది.

107మంది పోటీకి అనర్హులు

రాష్ట్రంలోని 107మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన వివరాలు సమర్పించకపోవడంతో ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 10ఏ ప్రకారం అనర్హత వేటు వేసింది. వీరిలో అత్యధికంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన 68 మంది ఉన్నారు. అప్పట్లో పసుపు రైతులు భారీ సంఖ్యలో నామినేషన్ వేసిన వారే కావడం గమనార్హం. వచ్చే జూన్ 23 వరకు వీరు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గంలోని 2, మహబూబాబాద్, మెదక్‌లో ఒక్కొక్కరు ఉండగా.. వీరిపై జూన్ 10వరకు వేటు కొనసాగుతుంది. జుక్కల్, రామగుండం, కరీంనగర్, గజ్వేల్, మల్కాజ్‌గిరి, నాగార్జునసాగర్, ఆలేరు, జనగాం, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరు, దేవరకొండ 5, మిర్యాలగూడ, పాలకుర్తి ముగ్గురు చొప్పున, నల్గొండ, ములుగు 4 చొప్పున, నకిరేకల్ 2, మల్కాజ్‌గిరి ఒకరిపై జూలై 14వరకు వేటు వేసింది. పాలకుర్తిలో ముగ్గురిపై ఆగస్టు 25వరకు, డోర్నకల్ ఒకరిపై సెప్టెంబర్ 21వరకు అనర్హత వేటు పడింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



ఒకే బావికి 12 మోటార్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీలో నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బావులలో నీరు ఇంకి పోతోంది. కాలనీ గుట్ట మీద ప్రాంతం కావడంతో ఎన్ని బోర్లు వేసినా నీరు పడడం లేదు. దీంతో కాలనీలో ఉన్న ఓ బావికి దాదాపు 12 మోటార్లు పెట్టి నీటిని తోడుకుంటున్నారు. అందరికీ తాగునీరు అందించే ఈ బావి కూడా అడుగంటి పోతోంది.

రూ.4,69,500 నగదు పట్టివేత


ఖానాపూర్: పట్టుబడిన నగదుతో అధికారులు


సారంగపూర్: పట్టుబడిన నగదుతో పోలీసులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలోని జిల్లా సరిహద్దులో గల చెక్‌పోస్ట్‌లో సోమవారం ఎస్ఎస్‌టీ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.4,69,500 నగదు పట్టుకున్నట్లు సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి తెలిపారు. ఏనుగుల రాములు వద్ద రూ.లక్ష, ఎండీ బహీరుద్దీన్ వద్ద రూ.59,500, బక్కయ్య వద్ద రూ.2,20,000 నగదు పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

రూ.1.13 లక్షల నగదు పట్టివేత

సారంగపూర్: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సిర్పెల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.1,13,500 నగదు పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. కారులో వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన రామచంద్ర వసంత్‌రావు, స్వర్ణ గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద ఈమొత్తం లభ్యమైనట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో జమచేసినట్లు ఎస్సై తెలిపారు.

రామాలయంలో మంత్రి సీతక్క పూజలు


పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ రామాలయంలో సోమవారం మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి మంత్రి పూజల్లో పాల్గొన్నారు. మంత్రికి గ్రామస్తులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రామపెద్దలు శ్రీధర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బజ్జీలు వేస్తూ ప్రచారం


బజ్జీలు వేస్తున్న గోడం నగేష్

కడెం: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో బజ్జీలు వేస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

మతోన్మాద పార్టీని మట్టుపెట్టాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్



మాట్లాడుతున్న కలవేణి శంకర్

ఎదులాపురం: మతోన్మాద విధానాలు అవలంబిస్తూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీని మట్టుపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతాంగ, ప్రజా, కార్మిక వ్యతిరేక బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఆదివాసీ ముద్దుబిడ్డ ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఐ శ్రేణులు ఆమెకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గద్దం భూపతిరెడ్డి, గోవర్ధన్, నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, అమినా బేగం, రమేశ్, కృష్ణస్వామి, పొచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

కొలువు ఆనందం తీరకముందే కానరాని లోకాలకు

- విద్యుత్ స్తంభం నుంచి కిందపడి జేఎల్ఎం మృతి
- విధుల్లో చేరిన 43 రోజులకే ఘటన


పవన్ కళ్యాణ్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: కష్టపడి కొలువు సాధించుకున్న జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) ఆ ఆనందం తీరకముందే కానరాని లోకాలకు చేరుకున్నాడు..తన కుమారుడికి ఉద్యోగం వచ్చిందని, తమ కష్టాలు తీరుతాయనుకున్న ఆ రైతు కుటుంబానికి తీరని శోకమే మిగిలింది.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన బుచ్చయ్య కుమారుడు పవన్ కళ్యాణ్ (23) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాత్ ఏరియాలో విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా 43 రోజుల క్రితం విధుల్లో చేరాడు. సోమవారం మధ్యాహ్నం బస్టాండ్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లాడు. విద్యుత్ స్తంభంపై సర్వీస్ వైర్ కాలిపోయింది. దానిని సరిచేసే సమయంలో ఇన్వెటర్ నుంచి సర్వీస్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా నిజామాబాద్ సమీపంలో మృతి చెందాడు. మృతునిది వ్యవసాయ కుటుంబం కాగా ఇటీవల నిర్వహించిన జేఎల్ఎం ఉద్యోగానికి ఎంపికయ్యాడు. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

మాదిగల ద్రోహి రేవంత్‌రెడ్డి


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

నిర్మల్‌చైన్‌గేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆదిలాబాద్ పార్లమెంటరీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని, మూడు పార్లమెంటు స్థానాలకు గానూ ఒక్క సీటు కేటాయించడం మాదిగలను మోసం చేయడమేనన్నారు. మాదిగలకు సీటు కేటాయించని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాల్సిన అవసరం లేదన్నారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో ఒక్క మాదిగకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. సమావేశంలో నాయకులు కేశవ్, భలే రావు నందకుమార్, శ్రీనివాస్, మల్లేశ్, బ్రహ్మన్న, శనిగారపు రవి పాల్గొన్నారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన మచ్చర్ల ముత్తన్న(46) నీటికుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్ తీసుకుని పంటపొలానికి వెళ్లాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా నీటికుంటలో మృతదేహాన్ని గుర్తించారు. నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుని సోదరుడు మచ్చర్ల గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సో మవారం గుర్తు తెలి యని వృద్ధుడు (80) వడదెబ్బతో మృతి చెందినట్లు సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబు ల్ కే.సురేశ్ గౌడ్ తెలిపారు. రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న పిల్లర్ గద్దెపై పడుకుని వృద్ధుడు మృతి చెందాడన్నారు. మృతుడు లైట్ బ్లూ కలర్ షర్ట్, వైట్ బనియన్ ధరించి ఉన్నాడని, మృతదేహం పక్కన చేతికర్ర ఉందన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596, 9948481902 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన గునిగంటి విక్రమ్ (38) భార్య ఆర్నెళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటినుంచి దిగాలుగా ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటిపైకప్పుకు చీరతో ఉరేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రాథోడ్ దిలీప్ మృతదేహం

లింగాపూర్: మండలంలోని పిక్లాతండాకు చెందిన రాథోడ్ దిలీప్ (28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు లక్సెట్టిపేట ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. దిలీప్‌కు నాలుగు నెలల క్రితం సత్యసాయినగర్‌కు చెందిన అరుణతో వివాహమైంది. స్వగ్రామంలో ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకండని నెలక్రితం అత్తగారి ఊరైన లక్సెట్టిపేటకు పంపించారు. ఈ నెల 27 అతిగా మద్యం సేవించి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి మృతుని తల్లి శోభాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ముధోల్: మండలంలోని మచ్కల్‌కు చెందిన మల్లె పూల సాయన్న ఈ నెల 18న దుబాయ్ లో మృతి చెందగా సోమవారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన సాయన్న అక్కడ గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

ఉపాధి కూలీ మృతి

భీమిని: మండలంలోని చిన్నగుడిపేటకు చెందిన ఉపాధి హా మీ కూలీ పంబాల నాగయ్య (74) సోమవారం మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఉపాధి పని చేస్తుండగా ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కూలీలు ఇంటికి తీసుకొచ్చారు. స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా మృతుని వయస్సు ఆధార్‌కార్డులో 74 ఉండగా ఉపాధి హామీ జాబ్ కార్డులో మాత్రం 58 ఉండడం గమనార్హం.

చోరీ కేసుల్లో ముగ్గురికి జైలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరికి 7 నెలలు, స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఏటీఎంలో చోరీకి యత్నించిన మరో వ్యక్తికి 45 రోజులు జైలు శిక్ష విధిస్తు జిల్లా కోర్టు న్యాయమూర్తి కే.నిరోషా సోమవారం తీర్పునిచ్చినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. 2023 సెప్టెంబర్ 6న హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మకాలనీకి చెందిన పాశం ప్రణీత్, ఎండీ.హుమర్ ఫరూఖ్ షిర్డీసాయిబాబా ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో 7 నెలల 15 రోజులు జైలుశిక్షతో పాటు రూ.400 జరిమానా విధించారు. దీంతో పాటు 2024 మార్చి 18న స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏటీఎంలో చోరీకి యత్నించిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గౌరవ్ మిశ్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో 45 రోజుల జైలుశిక్షతో పాటు రూ.100 జరిమానా విధించారు.

ప్రేమ విఫలమవుతుందేమోనని ఆత్మహత్య

- ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


నితిన్(ఫైల్)

వేమనపల్లి: ప్రేమించిన యువతి తనకు దక్కుతుందో.. లేదో.. తమ పెళ్లి జరుగుతుందో.. లేదోనని భయాందోళన చెందిన యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సుంపుటం గ్రామానికి చెందిన ఇగురం వెంకటి, జమున దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. పెద్దకుమారుడు నితిన్ (20) మంచిర్యాలలో డిగ్రీ చదువుతూనే ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం గోదావరిఖనికి చెందిన ఓ బాలికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల అమ్మాయి సుంపుటం గ్రామానికి వచ్చి మూడు రోజులు ఉండి వెళ్లిపోయింది. ఇంట్లో తమ తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, మనం ఎక్కడికైనా వెళ్లి పెళ్లి చేసుకుందాం రమ్మని రెండు రోజులుగా ఒత్తిడి తెచ్చింది. కానీ యువకుడి తల్లిదండ్రులు ముహూర్తం చూసుకుని అమ్మాయి వాళ్ల ఇంటికి వెళ్లి పెళ్లి ఖరారు చేసుకుందామని నచ్చజెప్పారు. ఇంతలోనే తమ ప్రేమ ఎక్కడ విఫలమవుతుందోనని భయపడిన యువకుడు సోమవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్ద కుమారుడైన నితిన్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

కార్మికచట్టాల పునరుద్ధరణకు ఉద్యమించాలి


మేడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: కార్మిక చట్టాల పునరుద్ధరణకు ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి పిలుపునిచ్చారు. పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘభవనంలో సోమవారం 138వ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికవర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో నుంచి 29 చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చిందని అన్నారు. దీంతో కార్మికులు, కర్షకులకు నష్టం కలుగుతుందన్నారు. కేంద్రప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు కడుకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, కొమటిపెల్లి భీమయ్య, అంకం శంకర్, కడుకుంట్ల నర్సింహులు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని సారంగపూర్ గ్రామానికి చెందిన రైతు జెట్టి పావని–లక్ష్మీనారాయణ దంపతుల కుమార్తె నీతాశ్రీ ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటింది. ఖానాపూర్ ఎంజేపీలో ఇంటర్ బైపీసీ చదివి, 987 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన ఆమెను గ్రామస్తులు సోమవారం శాలువా జ్ఞాపికతో సన్మానించి అభినందించారు. టీఆర్ఎస్వీ పశ్చిమ జిల్లా మాజీ అధ్యక్షుడు కొప్పుల నరేశ్, కోల నరేశ్, దాడిశెట్టి శ్రీనివాస్, శేఖర్, హెచ్ఎం శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మీవరప్రసాద్ ఉన్నారు.

ప్రోగ్రెస్ కార్డుల అందజేత

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సోమవారం పోషకుల సమావేశం నిర్వహించినట్లు ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు. విద్యాసంవత్సరం ముగిసిన నేపథ్యంలో వార్షిక పరీక్షల ఫలితాల ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. సరస్వతీ విద్యాపీఠం జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్, పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, సహ కార్యదర్శి వేద పాఠక్, విశికాంత్, బండారి శ్రీకాంత్, ప్రధానాచార్యులు సారథిరాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్నశర్మ, ఆచార్యులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు

భైంసాటౌన్: పట్టణంలో రాత్రివేళల్లో మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, వారికి వాహనం ఇస్తే యజమానితోపాటు పిల్లల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీగంజ్ ఎదుట నిర్వహించే హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వేళలు మార్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రాత్రి 12 గంటల నుంచే రోడ్డుపై ఒకవైపు పూర్తిగా ఆక్రమించి మార్కెట్ నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. ఇకపై ఉదయం 4 గంటల నుంచే మార్కెట్ నిర్వహించాలని, పరిసర ప్రాంత హోటల్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు సైతం రాత్రివేళల్లో తెరిచి ఉంచరాదని సూచించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: పట్టణ మున్నూరుకాపు యువజన సంఘం సభ్యుడు పి.సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మున్నూరుకాపు యువజన సంఘం తరఫున సోమవారం రూ.50 వేల ఆర్థికసాయాన్ని జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంట రాకేశ్, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వోడ్నం నరేందర్, అనిల్, కోశాధికారి చిరంజీవి, ఇప్ప శేఖర్, సంయుక్త కార్యదర్శి జాప సందీప్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

లక్ష్మణచాంద: మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన మండల సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు.

ఆధునిక సాగు వైపు.. రైతుల చూపు

- ఏడాదిలో మూడు పంటలు
- మొక్కజొన్న, వేరుశనగ, కర్బూజ సాగు
- పెట్టుబడి తక్కువ..అధిక దిగుబడి
- లాభాలు గడిస్తున్న పలువురు రైతులు


లోకేశ్వరంలో మల్చింగ్ పద్ధతిలో కర్బూజ

లోకేశ్వరం: సంప్రదాయ పంటల సాగు కన్నా ఆధునిక పంటల వైపు పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితో ఏడాదిలో మూడు పంటలు మొక్కజొన్న, వేరుశనగ, కర్బూజ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తూ ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. యాసంగి సీజన్‌కుగాను జిల్లాలోని లోకేశ్వరం, తానూరు, కుభీర్, సారంగాపూర్, మామడ, లక్ష్మణచాంద, భైంసా, ముథోల్ తదితర మండలాల్లో రైతులు 822 ఎకరాల్లో కర్బూజ సాగు చేశారు. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర ప్రాంతాలకు ఇక్కడి నుంచి కర్బూజ ఎగుమతి అవుతున్నాయి. భైంసా, నిజామాబాద్ వ్యాపారులు హోల్‌సేల్‌గా రైతుల నుంచి కొనుగోలు చేసి అవసరం ఉన్న ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

అధునాతన పద్ధతుల్లో..

సాధారణ పద్ధతుల్లో సంప్రదాయ పంటలు సాగు చేస్తే పెట్టుబడి, నీటి వినియోగం చీడపీడల బెడద అధికం. దిగుబడి తక్కువ రావడం మార్కెట్‌లో ధర లేకపోవడం జరుగుతోంది. దీంతో విసుగుచెంది ప్రయోగాత్మకంగా రెండెకరాల్లో మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ వంటి సాంకేతికతతో కూడిన అధునాతన పద్ధతుల్లో మొక్కజొన్న, వేరుశనగ, కర్బూజ తదితర సాగు చేసి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

తక్కువ సమయంలో..

మొదట పసుపు పంట సాగు చేసిన అనంతరం అందులో నువ్వు, కర్బూజ సాగు చేపట్టి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. వేరుశనగ అనంతరం మల్చింగ్ విధానంలో కర్బూజ సాగుచేసి అందులో అంతర పంటగా బొప్పాయి వేశారు. భాగాపూర్ చెందిన రైతు కృష్ణారెడ్డి ఈ సీజన్‌లో ఎకరంలో కర్బూజ సాగుకు రూ.45 వేలు పెట్టుబడి పెట్టి మూడు నెలల్లో రూ.1.60 లక్షలకు పైగా ఆదాయం పొందారు. ఇందులో అంతరగా సాగు చేసిన బొప్పాయికి అదనపు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు.

ప్రోత్సాహం అందించాలి

డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ షీట్లపై రాయితీ అందించకపోవడం, మార్కెటింగ్ వసతి లేకపోవడం తదితర కారణాలతో రైతులకు ఆరుతడి పంటల ప్రాముఖ్యత తెలియడం లేదు. వరి సాగు నుంచి వారి దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వం ఆరుతడి సాగు చేసే వారికి రాయితీ రూపంలో ప్రోత్సాహకాలు అందిస్తోంది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సేవలను రైతులకు చేరువ చేయడం, మద్దతు ధర, మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తక్కువ ఖర్చుతో లాభాలు



తనకున్న 12 ఎకరాల్లో నుంచి రెండున్నర ఎకరంలో కర్బూజ వేశాను. ఎకరాకు రూ.45 వేలు పెట్టుబడి పెట్టి మూడునెలల్లో రూ.1.60 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. అంతర పంటగా బొప్పాయికి అదనపు ఆదాయం వస్తుంది.

– కృష్ణారెడ్డి, రైతు, భాగాపూర్

లాభం పరిమితమే



పండ్లు నిల్వ చేసుకునే వీలు లేకపోవడంతో వ్యాపారులు సూచించిన ధరకు విక్రయించాం. కిలో రూ.7 చొప్పున ధర లభించింది. ఎకరాకు రూ.లక్ష తీసుకున్నా రైతులకు లాభం. కర్బూజకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా రైతులకు మాత్రం లాభం పరిమితమే.

– మంద శ్రీధర్, రైతు, ధర్మోర

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రామారావు పటేల్


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో సోమవారం నూతన బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీరప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. జిల్లా కురమ సంఘం అధ్యక్షుడు జెడ్ల రాజారాం, నాయకులు రాజేష్‌బాబు, రమేశ్, భోజన్న, సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ మేకల రమేశ్, గజ్వేరి భూమన్న, దేవన్న, మోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా చౌడాలమ్మ ఉత్సవాలు


ఊరేగింపులో కళాబృందం ప్రదర్శనలు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో గల నడింపల్లె గ్రామంలో సోమవారం చౌడాలమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం పట్నాలు వేసి పూజలు చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపురం కనక గట్టయ్య కళాబృందం ఆధ్వర్యంలో డోలు వాయిద్యాలతో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బొజ్జ అనిల్ యాదవ్, దాసరి రాజేశ్వర్, అంబటి రాజన్న, మాన్క దేవేందర్, అంబటి చంద్రయ్య, అంబటి లింగన్న, కొక్కుల శేఖర్, చిప్ప దేవన్న, మాన్క రమేశ్ ఉన్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తానూరు: బీఆర్ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ బౌద్ధమహాసభ నాయకుడు గంగాధర్ వాగ్మారే పేర్కొన్నారు. మండలంలోని ఉమ్రి(కే) గ్రామాల్లో సోమవారం అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దళితులకే కాకుండా అన్నివర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించారని అన్నారు. దళితులు ఉన్నత చదవులు చదివి ఎదగాలన్నారు. అంబేద్కర్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. అనంతం గ్రామంలోని ఆయా వీధుల గుండా అంబేద్కర్ చిత్రపటంతో ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరోతి, మాజీ ఉప సర్పంచ్ దేవకే సాయినాథ్, యూత్ యువకులు సూర్యకాంత్, కీర్తికుమార్, గౌతం, సందీప్, మాధవ్, గోవింద్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


రేవోజీపేటలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్


సోన్: లోకల్‌వెల్మల్ గ్రామంలో ఉపాధి కూలీలకు కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

దస్తురాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు రేవోజీపేట గ్రామంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. బీజేపీ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎంపీ బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

భైంసా: పార్లమెంట్ ఎన్నికల్లో మరోమారు బీజేపీని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిపాండే అన్నారు. బిద్రెల్లి గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. పార్టీ బాసర మండల అధ్యక్షుడు కిశోర్‌దేశాయి, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్, జిల్లా కోశాధికారి విశ్వనాథ్‌పటేల్, బీజేవైఎం అధ్యక్షుడు యోగేశ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు కేంద్ర పథకాలు వివరించారు. మోదీని మూడోసారి ప్రధాని చేయాలన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం కూలీలతో కలిసి పని చేశారు.

భైంసాటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో బీజేపీ నాయకులు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజీవ్ నగర్, నర్సింహానగర్, సుభాష్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మోదీని మూడోసారి ప్రధాని చేయాలని ఓటర్లను కోరారు.

మహిళలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జగన్‌మోహన్

తానూరు: మండలంలోని బోల్సా గ్రామంలో ఇటీవల జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కొందరు యువకులు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలపై దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు జగన్‌మోహన్ కోరారు. బోల్సా గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించి మహిళలపై జరిగిన దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మి యాదవ్, రాజేశ్వర్, సునీల్, సుదా, నాగమణి, సవిత, ఆకాశ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వేసవితాపం.. తీరెను దాహం!



భైంసాటౌన్:ఎండలు రోజురోజుకు మండిపోతున్నాయి. చెరువులు, కుంటలు వంటి నీటివనరులు ఎండిపోతున్నాయి. దీంతో పశుపక్ష్యాదులు దాహంతో అల్లాడుతున్నాయి. పట్టణ శివారులోని జీఆర్‌పీ ప్ర భుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కోతులు, వానరాలు సంచరిస్తూ నీటి కోసం అల్లాడుతుండడంతో, అధ్యాపకుడు ఓంప్రకాశ్ నీటి తొట్టిని ఏర్పాటు చేసి అందులో నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. అటుగా వచ్చిన వానరాలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

హెల్మెట్ ధరించాలి

ముధోల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఏఎస్సై పుష్పలత అన్నారు. తరోడా గ్రామంలో వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ కోసం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం పట్టుబడితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది మోహన్‌రావు, చారి, అర్జున్ తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లవి బూటకపు హామీలు

- పదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదు
- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


సారంగాపూర్‌లో మాట్లాడుతున్న శ్రీహరిరావు


కుంటాల: పెంచికల్‌పాడ్‌లో ప్రచారంలో నేతలు

సారంగపూర్: బీజేపీ, బీఆర్ఎస్‌లవి బూటకపు హామీలు ఇస్తోందని, పదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండలంలోని చించోలి(బి), సారంగాపూర్, అడెల్లి గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సోమవారం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ మరో 5 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రచారానికి వచ్చిన శ్రీహరిరావుకు ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా వచ్చే నీరు మురికిగా వస్తుందని తెలిపారు. సారంగాపూర్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని తామే అప్పు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాముడి పేరుచెప్పి గుళ్లు కట్టినంతా మాత్రాన ప్రజల సమస్యలు తీరవన్నారు. ఉపాధి కూలీల పని దినాలను 200ల రోజుల నుంచి వంద రోజులకు కుదించారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ఎంపీపీ ఆడె సవితాబాయి, న్యాయవాది మల్లారెడ్డి, నాయకులు ఉన్నారు.

కుంటాల: అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమని జెడ్పీ మాజీ చైర్మన్ అశోక్ అన్నారు. మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున సోమవారం ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బుచ్చన్న, భోజారాం పటేల్, సవ్వి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సోన్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు, న్యాయవాది అల్లూరి కృష్ణవేణి అన్నారు. మండలంలోని మాదాపూర్‌లో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ సోమవారం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాజనర్సింహరెడ్డి, నాయకులు వాసవి, సాయికృష్ణ, గంగాధర్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుర్జాపూర్‌లో నాయకులు ప్రచారాన్ని చేశారు. నిమ్మల రమేశ్, కిశోర్‌నాయక్, నయిం, జూనీ, శ్రీపాద శేషాద్రి, దాసరి రాజన్న, వేల్పుల రమేశ్, ధాత్రిక రాము, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజేందర్‌నాయక్, గాజుల శ్రీనివాస్, గంగన్న, బిక్కి చిన్న రాజన్న, శ్రీనివాస్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్చాంద, పుస్పూర్, ధర్మోర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సంగెం నర్సన్న, నాయకులు సుధాకర్, మహేందర్, సుధార్‌రావు, ముత్యంరెడ్డి ఉన్నారు.

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్, బెల్గాం గ్రామాల్లో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, నాయకులు తూము రాజేశ్వర్, జయరాం, మైనార్టీ నాయకులు జావెద్‌ఖాన్, నాయకుడు సతీశ్ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు. ఇందులో నాయకులు గంగారెడ్డి, వాలిఖాన్, హరిఫోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ మండల సమావేశం

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి విలాస్ గాదేవార్ ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా పట్టణంతోపాటు మండల కార్యకర్తల సమావేశం ఉంటుందని, ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

భైంసాటౌన్: పట్టణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కాటన్‌యార్డులోని రైతు విశ్రాంతి భవనం నుంచి గౌరీ శంకర్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావుపటేల్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. భైంసా పట్టణంతోపాటు భైంసా, కుభీర్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'అమ్మ ఆదర్శ' పనులు పకడ్బందీగా చేపట్టాలి


కన్నపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

లోకేశ్వరం: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద మంజూరైన పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మండలంలోని కన్నపూర్, లోకేశ్వరం, పంచగుడి గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మంజూరైన నిధులతో మరుగుదొడ్డి, తాగునీటి, విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. స్వయం సహాయక కమిటీ సభ్యులు దగ్గరుండి పనులను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట పీఆర్ఏఈ రఘువంశీ, ప్రధానోపాధ్యాయులు రమేశ్‌కుమార్, శ్రీనివాస్, జయసుందర్, ఐకేపీ సభ్యులు ఉన్నారు.

'కాళేశ్వరం' అవినీతిపై టీజేఎస్ పోరాటం

ఖానాపూర్: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై పోరాటం చేసి భూనిర్వాసితుల పక్షాన టీజేఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిలక్ రావు అన్నారు. టీజేఎస్ ఆరో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులే కేంద్రంగా జరుగుతున్న నేటి రాజకీయాల్లో టీజేఎస్ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలే రాజకీయ ఎజెండాగా ప్రజల్లోకి వెళ్లిందన్నారు. ప్రత్యేకంగా నిరుద్యోగ సమస్యపై అధ్యయనం చేసి సదస్సు ద్వారా వారిని చైతన్యం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

ముధోల్: తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడిన ఏకైక టీజేఎస్ అని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ముధోల్ ఆయన విలేకరులతో మాట్లాడారు. టీజేఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిందన్నారు.

నేడు బీజేపీ ఎంపీ అభ్యర్థి రాక

కుభీర్: మండల కేంద్రానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ పర్యటిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పార్డి(బి), 10 గంటలకు కుభీర్‌కు వస్తారని, పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోహన్ సింగ్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.